క్లుప్తంగా

నూకాలమ్మ ఆశీస్సులు నగర ప్రజలపై ఉండాలి



నూకాలమ్మ సేవలో నాని, సునీల్ కుమార్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక కొత్తపేట గ్రామ దేవత శ్రీ నూకాలమ్మవారి ఆశీస్సులు నగర ప్రజలపై ఎల్లవేళలా ఉండాలని ఎమ్మెల్యే ఆళ్ల నాని ఆకాంక్షించారు. నూకాలమ్మ ఆలయంలో అమ్మవారి 44వ వార్షిక జాతర మహోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్‌తో కలిసి పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు నాని, సునీల్ కుమార్‌యాదవ్‌లకు అమ్మవారి ప్రసాదం అందజేశారు. అనంతరం అమ్మవారి ఊరేగింపు కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. అమ్మవారి ఊరేగింపు కార్యక్రమంలో కోలాట నృత్యాలు చేసిన చిన్నారులను అభినందించారు. ఆలయ అభివృద్ధికమిటీ ప్రతినిధులు, కార్పొరేటర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

మిల్లు మూసివేత అమానుషం

ఏలూరు (టూటౌన్): కొత్తూరు జూట్ మిల్లును మూసివేయడం అమానుషమని ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రికల్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు లింగమల్లు శ్రీనివాసరావు సోమవారం పేర్కొన్నారు. ఈ మిల్లును తెరిచే ప్రయత్నం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఇఫ్టూ ఆధ్వర్యంలో ధర్నా

జూట్ మిల్లును తెరిపించాలని కోరుతూ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మిల్లు గేట్ ఎదుట ధర్నా చేశారు. కోలా ఉమాశంకర్, బద్దా వెంకట్రావు, వీరంకి సాయిబాబు మాట్లాడారు.

నేడు ఉగాది ఉత్సవాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఉగాది ఉత్సవాల నిర్వహణకు ఏలూరులో ఏర్పాట్లు చేశాయి. సాహిత్య మండలి ఆధ్వర్యంలో రామకృష్ణాపురంలోని సాహిత్య మండలి హాలులో మంగళవారం ఉదయం 9.30 గంటలకు ప్రారంభం కానున్నాయి. కెనాల్ రోడ్డులోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం, యూటీఎఫ్, హేలాపురి బాలోత్సవ కమిటీ, బహుజన ఆఫీసర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో పంచాగ శ్రవణ కార్యక్రమం నిర్వహించనున్నారు.

వైఎస్సార్ సీపీ విజయం తథ్యం

ఏలూరు టౌన్ : రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం తథ్యమని ఎమ్మెల్యే ఆళ్ల నాని అన్నారు. సోమవారం ఆయన ఎంపీ అభ్యర్థి సునీల్‌కుమార్‌తో కలిసి నగరంలోని 21, 20 డివిజన్లలో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్, పార్టీ నగర అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్‌బాబు, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవులు, కోఆప్షన్ సభ్యుడు మున్నుల జాన్‌గురునాథ్, సీతా జైన్, పార్టీ నగర మహిళా అధ్యక్షురాలు నున్న స్వాతిశ్రీదేవి, కార్పొరేటర్లు జిజ్జువరపు విజయనిర్మల, యర్రంశెట్టి సుమన్, కలవకొల్లు సాంబ, పొలిమేర దాసు, పార్టీ యువజన అధ్యక్షుడు నిడికొండ నరేంద్ర, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి పొలిమేర హరికృష్ణ, సేవాదళ్ అధ్యక్షుడు యల్లాపు మోజెస్, పార్టీ నగర వైస్ ప్రెసిడెంట్ పిట్టా ధనుంజయ్, నాయకులు శానంపూడి మోహన్, గంధం బాబి, ఏనుగు సురేష్, యేసుపాదం తదితరులు ఉన్నారు.

జగన్ హయాంలో అందరికీ మేలు

ఏలూరు రూరల్ : వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి ముఖ్యమంత్రి అవ్వడం తథ్యమని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు పీపీ రావు అన్నారు. సోమవారం ఏలూరు రూరల్ మండలం మాదేపల్లిలో నిర్వహించిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, మహానేత అభిమానుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భవిష్యత్తు గ్యారంటీ పేరుతో మరోసారి చంద్రబాబు ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారని దుయ్యబట్టారు. 2014 ఎన్నికల్లో విజన్ పేరుతో గెలిచిన చంద్రబాబు రైతులు, డ్వాక్రా సంఘాలు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా మోసం చేశారని గుర్తుచేశారు. 2019 ఎన్నికల్లో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేశారని వివరించారు. సుమారు 125 సార్లు బటన్ నొక్కి పథకాలు ప్రజల ఖాతాల్లోకి నేరుగా జమ చేశారని చెప్పారు. వైఎస్సార్ సీపీ పాలనలో రైతులు, డ్వాక్రా సంఘాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల ప్రజలు కుల, మత, వర్గ బేధాలు లేకుండా సంక్షేమ పథకాలు పొందుతున్నారని, వారంతా రాబోయే ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డినే గెలిపిస్తారని చెప్పారు. ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు మాట్లాడుతూ దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి కృషితో గ్రామాల్లో సచివాలయాలు, వైఎస్సార్ క్లినిక్ భవనం, పాల కేంద్రం, నాడు నేడు నిధులతో పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, గ్రామాలు అభివృద్ధి బాట పట్టించామన్నారు. అర్హులందరికీ పథకాలు అందించారన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు తేరా ఆనంద్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో మరోసారి అబ్బయ్యచౌదరిని గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. సమావేశంలో నాయకులు సర్పంచ్ కొరపాటి శ్రీరామ్‌ప్రభుదేవ్, బొల్లిముంత రాము, నరహరిశెట్టి రాధాకృష్ణ, గ్రామ ధ్యక్షుడు పల్నాటి చైతన్య, ఎస్సీసెల్ జిల్లా కార్యదర్శి గారపాటి నాగేశ్వరరావు, సచివాలయ కన్వీనర్ గుర్రం శివ, మానుకొండ సాయి, ఏలూరు సుధాకర్, రామాల శ్రీను, గుడిపూడి వెంకటరత్నం, చెన్నకేశవుల రాము, మోటేపల్లి రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ఏలూరు టౌన్: 20వ డివిజన్‌లో ఎమ్మెల్యే నాని, ఎంపీ అభ్యర్థి సునీల్‌కుమార్‌కు హారతులు పడుతున్న మహిళలు



ఏలూరు రూరల్ : మాదేపల్లిలో సమావేశం నిర్వహించిన వైఎస్సార్‌సీపీ నాయకులు



ఏలూరు రూరల్ : పాల్గొన్న పార్టీ కార్యకర్తలు

సత్వర న్యాయం అందించేందుకు కృషి



మేరీ గ్రేస్ కుమారి

ఏలూరు (టూటౌన్): కక్షిదారులకు సత్వర న్యాయం అందించేందుకు లీగల్ సర్వీసెస్ అథారిటీ చట్టం రూపొందించారని, ఇందులో భాగంగా శాశ్వత లోక్ అదాలత్ ఏర్పాటు చేశారని శాశ్వత లోక్ అదాలత్ చైర్ పర్సన్ ఎ.మేరీగ్రేస్ కుమారి అన్నారు. స్థానిక జిల్లా న్యాయసేవాధికార సంస్థ భవనంలో న్యాయవాదులకు, కక్షిదారులకు శాశ్వత లోక్ అదాలత్ ఉపయోగాలపై సోమవారం అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా మేరీ గ్రేస్ కుమారి మాట్లాడుతూ శాశ్వత లోక్ అదాలత్‌లో విద్య, వైద్యం, పోస్టల్, బీమా, రియల్ ఎస్టేట్, రవాణా, పారిశుధ్యం, బ్యాంకింగ్, ఎన్ఈఆర్‌జీఎస్, టెలికం సేవల్లో లోపాలపై విచారణ చేస్తారని చెప్పారు. శాశ్వత లోక్ అదాలత్‌లో ఇచ్చే తీర్పులకు అప్పీలు ఉండదని, రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని తెలిపారు.

విజయబావుటా ఎగురవేయాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): క్రోధి నామ సంవత్సరంలో విద్యార్థులు తమ లక్ష్యాలు సాధించి విజయబావుటా ఎగురవేయాలని సీఆర్ఆర్ ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ కొండా హరిరామ కృష్ణంరాజు ఆశాభావం వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక సీఆర్ఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఎంబీఏ విభాగం ఆధ్వర్యంలో క్రోధి నామ సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణంరాజు మాట్లాడుతూ తెలుగు ప్రజలకు ఉగాది పండుగ ఒక ప్రత్యేకమైందన్నారు. నూతన సంవత్సరంగా పరిగణించే ఈ పండుగను ఆధ్యాత్మిక విలువలతో చేసుకోవడం పరిపాటి అన్నారు. షడ్రుల ఉగాది పచ్చడికి తెలుగు ప్రజల్లో ఎంతో విశిష్ట స్థానం ఉందని, తమ జీవితాల్లో ఎటువంటి అనుభవాలు ఎదురైనా వాటన్నింటికీ ఒకే విధంగా స్పందించేలా మానసికంగా ప్రజలను సంసిద్ధులను చేయడమే ఉగాది పచ్చడి సారాంశమని వివరించారు. వేద పండితుడు నరసింహ శాస్త్రి ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. పంచాగ శ్రవణం చేశారు. అనంతరం విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి కోలాటాలు, భరతనాట్య ప్రదర్శనలు చేసి ఆకట్టుకున్నారు. ప్రిన్సిపాల్ కొండ్రెడ్డి వెంకటేశ్వర రావు, హెచ్ఓడీ కొడాలి వెంకట శ్రీధర్, కోఆర్డినేటర్లు నిమ్మల సతీష్, మండ సుష్మ, హెచ్ఓడీలు, అధ్యాపకులు పాల్గొన్నారు.



సంప్రదాయ వస్త్రధారణలో విద్యార్థినులు

ఉద్యోగులపై వేధింపులను అరికట్టాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థలో పని చేస్తోన్న ముస్లిం మైనార్టీ ఉద్యోగులపై గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం శేఖర్‌బాబు వేధింపులను అరికట్టాలని ఆవాజ్ సంస్థ అధ్యక్షుడు షేక్ కరీముల్లా కోరారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. రంజాన్‌లో ఏటా ప్రభుత్వం ముస్లిం ఉద్యోగులకు ఒక గంట ముందు విధుల నుంచి వెళ్లడానికి అనుమతిస్తూ జారీచేసిన ఉత్తర్వులను శేఖర్‌బాబు బేఖాతరు చేస్తున్నారని పేర్కొన్నారు. గంట ముందు విధుల నుంచి వెళ్లిన వారికి సంజాయిషీలు కోరుతూ కక్ష సాధిస్తున్నారని తెలిపారు.

బీసీలంతా సీఎం జగన్ వెంటే

ఏలూరు టౌన్: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఐక్య బీసీ సంఘాలు, గౌడ సంఘాలన్నీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ఉంటాయని రాష్ట్ర గౌడ సంఘం అధ్యక్షుడు చలుమోలు అశోక్ గౌడ్ చెప్పారు. ఏలూరు శ్రీరామ్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నానిని సోమవారం ఆయన మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. రాష్ట్రంలో బీసీలకు రాజకీయంగా అత్యధిక ప్రాధాన్యత ఇస్తోన్న ఏకైక నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే అన్నారు. రాబోయే ఎన్నికల్లో బీసీలంతా ఐక్యంగా వైఎస్సార్‌సీపీ విజయానికి శక్తివంచన లేకుండా పనిచేస్తాయని తెలిపారు. ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ సీఎం జగన్ బీసీల పక్షపాతి అని అన్నారు. కార్యక్రమంలో చల్లచింతలపూడి సర్పంచ్ బయగాని శ్రీమన్నారాయణ, ఉపాధ్యక్షులు బయగాని అంకాలరావు, వేముల రమేష్, కార్పొరేటర్ బత్తిన విజయకుమార్ తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యే నానిని కలిసిన అశోక్‌గౌడ్

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	28	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	20	చిక్కుడు కాయలు	72
వంకాయలు (కాంతులు)	30	చామదుంపలు	50
వంకాయలు (తెలుపు)	34	ములక్కాడలు	05,07
బెండకాయలు	16	కంద	68
పచ్చిమిర్చి	34	బీట్‌రూట్	38
కాకర కాయలు	30	కీరా దోస	34
బీరకాయలు	30	ఫ్రెంచ్‌బీన్స్	80
బీరకాయలు (పందిరి)	40	అల్లం	160
క్యాబేజీ	324	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	34-40	పాలకూర	10
దొండకాయలు	20	చుక్కకూర	10
బంగాళదుంపలు	30	తోటకూర	10
ఉల్లిపాయలు	26	గోంగూర	08
గోరుచిక్కుడు	24	పుదీనా	05
దోసకాయలు	16	బఠాణీ	--
అనబకాయ (1)	15-20	క్యాప్సికమ్	70
పొట్లకాయ(1)	15-20	చిలకడదుంప	32

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	20
ఏలూరు - బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.30	34
ఏలూరు - బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	32
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	21

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	11
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	19
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	07
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	20
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	26
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	17
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	12
ఏలూరు -తిరుపతి	16.00	4830	34

ఏలూరులో వలంటీర్ల రాజీనామా



ఎమ్మెల్యే నానిని కలిసిన రాజీనామా చేసిన వలంటీర్లు

ఏలూరు టౌన్ : చంద్రబాబు నీచ రాజకీయాలకు పాల్పడుతూ వలంటీర్ల మనోభావాలు దెబ్బతీస్తున్నారని ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని అన్నారు. ఏలూరు 16వ డివిజన్ అరుంధతీపేట 42వ సచివాలయానికి చెందిన 16 మంది సచివాలయ వలంటీర్లు తమ పదవులకు సోమవారం రాజీనామా చేశారు. కార్పొరేటర్ జిజ్జువరపు విజయనిర్మల, పార్టీ యువజన నాయకులు జిజ్జువరపు రమేష్ ఆధ్వర్యంలో ఏలూరు శ్రీరామ్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే నానిని మర్యాదపూర్వకంగా కలిశారు. తామంతా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ప్రజలకు సేవ చేసేందుకు స్వచ్ఛందంగా బాధ్యతలు స్వీకరించామని, నేడు చంద్రబాబు కక్షపూరిత ధోరణితో వ్యవహరిస్తూ తమ అనుకూల వర్గంతో కేసులు వేయిస్తూ అవమానించేలా చేస్తున్నారని వలంటీర్లు ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి శాయశక్తులా కృషి చేస్తామని చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ చంద్రబాబు కూటమికి ప్రజలే గట్టిగా బుద్ధిచెబుతారని, పేదవర్గాల సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ కట్టుబడి ఉందని అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే ప్రజలకు మంచి జరుగుతుందని తెలిపారు. రాజీనామా చేసిన వలంటీర్లలో అంబిక, జగదీష్, గౌరవాణి, పృథ్వీ, రామలక్ష్మి, లావణ్య, భవాని, మౌనిక, అహరోన్, మహేష్, ముంతాజ్ భేగం ఉన్నారు.

సంస్కృత పాఠశాల సందర్శన



వేద విద్యార్థులతో గుళ్లపల్లి శ్రీనివాస్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): కాంచీపురం శ్రీ చంద్రశేఖర సరస్వతీ మహా విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ గుళ్లపల్లి శ్రీనివాస్ హేలాపురి పర్యటనలో భాగంగా స్థానిక కాంచి కామకోటి సంస్కృత స్మార్త ప్రయోగ వేద పాఠశాలను సోమవారం సందర్శించారు. విద్యార్థులతో సంభాషించి వేద విద్య విశిష్టత వివరిస్తూ విద్యార్థులకు తమ ఆశీస్సులు అందించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ డీన్ వెంకటరమణ, సంస్కృత శాఖ ఆచార్యులు నాగేశ్వరరావు, పురోహిత సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు యామిజాల నరసింహమూర్తి, అఖిల భారత బ్రాహ్మణ సమాఖ్య ఉభయ తెలుగు రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యుడు వడ్లపట్ల సాయి శరత్, బ్రాహ్మణ సంఘ రాష్ట్ర నాయకుడు అడవి కేశవరావు పాల్గొన్నారు.